క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి



రాజీనామా చేసిన వలంటీర్లతో హనిమిరెడ్డి

జే.పంగులూరు: అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలని, దానికి ప్రతి ఒక్కరూ నెల రోజులు కష్టపడి పనిచేయాలని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనమిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో 10 మంది వలంటీర్లు తమ పదవులను రాజీనామా చేశారు. రాజీనామా చేసిన 10 మంది వలంటీర్లు శనివారం పానెం చిన హనిమిరెడ్డిని అద్దంకి పార్టీ ఆఫీసులు కలిసి వారి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సింధూర అజిల్, నాయకులు గొల్లపూడి నాగేశ్వరావు, కోయి కాజారావు, నాదేండ్ల వీరయ్య. కొడవల్ల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న హనిమిరెడ్డి

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామానికి చెందిన గుడిపాటి సుబ్బయ్య, రేణింగవరం గ్రామానికి చెందిన కొనం సుబ్బారెడ్డి ఒంగోలు ప్రవేటు వైద్యశాలలో అనారోగ్యం కారణంగా చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలిసిన అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి శనివారం హాస్పిటల్‌కి వెళ్లి అక్కడ చికిత్స తీసుకుంటున్న ఇరువురుని పరామర్శించి, వారి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య అందించాలని వైద్యులను కోరారు. వీరి వెంట పంగులూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి



కాలేషావలి (ఫైల్)

యద్దనపూడి: మండలంలోని జాగర్లమూడి గ్రామ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాలేషావలి (47) శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతిచెందాడు. ఖాలేషావలి స్వగ్రామం యద్దనపూడి. ఖాలేషావలికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి అస్వస్థతగా ఉండటంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటు వచ్చింది .ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఆర్డీవో రవీందర్, తహశీల్దారు నాగరాజు, డిప్యూటీ తహశీల్దారు విష్ణుప్రసాద్, వీఆర్వోలు సత్యనారాయణ, శేషుబాబు, వసంతరావు, రవి, పావని, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున రూ.50 వేలు అందజేశారు.



దేవాంగుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్



జగనన్న పథకాలను మహిళలకు వివరిస్తున్న వెంకటేష్

అభివృద్ధి చేసి చూపించాం.. ఆశీర్వదించండి

- దేవాంగులకు జగనన్న చేసిన మేలు మరువలేనిది
- ఆత్మీయ సమావేశంలో చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం

చీరాల: సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ప్రణాళికాబద్ధంగా పనిచేసి చీరాలను అభివృద్ధిలో నిలిపాం.. మమ్మల్ని ఆశీర్వదించాలని చీరాల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ సూచించారు. శనివారం రాత్రి మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీలోని హస్తినాపురంలో, రైల్వేస్టేషన్ సమీపంలోని కాలనీల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ దేవాంగపురి గ్రామ పంచాయతీలో గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడం, మౌలిక వసతులు కల్పించి ప్రజలందరికి అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపామన్నారు. సీఎం జగనన్న దేవాంగులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి దేవాంగులు, చేనేతల అభివృద్ధికి అధిక తోడ్పాటు అందించారన్నారు. నేతన్న నేస్తం ద్వారా ప్రతీ చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.24 వేలు అందించి ఆర్థిక సుస్థిరత, సొంత మగ్గాల ఏర్పాటుకు, వృత్తి నైపుణ్యాలను పెంచేందుకు కృషి చేశారన్నారు.

ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మొద్దు..

గడిచిన ఐదేళ్లలో చీరాల నియోజకవర్గంలో అన్నీ వర్గాల అభ్యున్నతికి, అభివృద్ధితో పాటుగా ప్రజల సంక్షేమానికి అండగా నిలిచామన్నారు. గొప్ప పథకాలు అందించి ప్రజల జీవన ప్రమాణాలు మార్చిన జగనన్నకు అందరం అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. వచ్చేనెల 13న జరగనున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపీ నందిగం సురేష్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలన్నారు. చీరాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు బహుమతిగా ఇద్దామన్నారు. అందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. పేద సామాజిక వర్గాల కోసం జగనన్న అమ్మఒడి, పింఛన్లు, చేనేత నేతన్న నేస్తం, విద్యా దీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత, చేదోడు పథకాల ద్వారా పేదలు లబ్ధి పొందారన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఇచ్చే ఆచరణకు నోచుకోని హామీలను పట్టించుకోకుండా వైఎస్సార్ సీపీకి, సీఎం జగనన్నకు అందరూ సంపూర్ణ మద్దతివ్వాలని కోరారు. దీంతో గ్రామస్తులు అందరూ తమకు అన్నీ విధాలుగా అండగా నిలుస్తున్న వెంకటేష్ గెలుపు కోసం తమవంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పృథ్వీ వెంకటేశ్వర్లు, పృథ్వీ బాలసుబ్రమణ్యం, పృథ్వీ ధనుంజయ్, లేళ్ల హనుమంతరావు, పాటుగా మండల పార్టీ అధ్యక్షుడు అంకాళరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, నాగలింగం, కిరణ్, నాగేశ్వరరావు, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

వెంకటేష్‌ను అసెంబ్లీకి పంపే బాధ్యత అందరిదీ



ఎమ్మెల్యే కరణం బలరాంతో కావూరివారిపాలెం నాయకులు

- ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం
- కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరాం సూచన

చీరాల టౌన్: గడిచిన ఐదేళ్లలో చీరాలను అభివృద్ధిలో పరుగులు పెట్టించాం.. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ చీరాలను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేశాం కావునా చీరాల ఎమ్మెల్యేగా వెంకటేష్‌ను గెలిపించి అసెంబ్లీకి పంపాల్సిన బాధ్యత మనందరిదని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కావూరివారిపాలెం గ్రామంలో ముఖ్య నాయకులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. గ్రామ నాయకులు ఆర్‌బీకే చైర్మన్ కె.రమణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రత్నారెడ్డి, పిట్టు నాగిరెడ్డి, యదలారెడ్డి నివాసాల్లో గ్రామంలోని నాయకులు, యువతతో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బలరాం మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహకారం అందించారన్నారు. పార్టీలో కష్టించి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వెంకటేష్‌ను చీరాల ఎమ్మెల్యేగా, సీఎంగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డికి గెలిపించుకుని పార్టీకి కృతజ్ఞత చెప్పే సమయం వచ్చిందన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వెంకటేష్‌ను, ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి గెలిపించునేంత వరకు విశ్రమించవద్దన్నారు. ఈఐదేళ్లలో నియోజకవర్గ ప్రజలకు తమ కుటుంబం అందుబాటులో ఉంటూనే అందరికి అండగా నిలిచామన్నారు. గ్రామంలో పార్టీని బలోపేతం చేసి స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారాన్ని చేసి వెంకటేష్‌కు మంచి మెజార్టీ తీసుకురావాలని ఎమ్మెల్యే బలరాం నాయకులకు సూచించారు. అందరు వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతిచ్చి తన గెలుపునకు సహకరించి చీరాల నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, రూరల్ అధ్యక్షుడు అంకాళరెడ్డి, డి.సురేష్, అంకిరెడ్డి తదితరులు ఉన్నారు.

అద్దంకిలో వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న గ్రాఫ్



వైఎస్సార్ సీపీలో చేరిన కొత్తమల్లాయపాలెం ఎస్సీకాలనీ వాసులు

- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన కొత్తమల్లాయపాలెం ఎస్సీ కాలనీ వాసులు
- సమస్యలు తెలుసుకున్న అసెంబ్లీ అభ్యర్థి హనిమిరెడ్డి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి హనిమిరెడ్డి

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజారంజక పాలనకు ఆకర్షితులై రోజురోజుకు గ్రామాల వారీగా టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన్న హనిమిరెడ్డి అన్నారు. శనివారం బల్లికురవ మండలంలోని కొత్తమల్లాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అబ్బారెడ్డి పార్థసారథి ఆధ్వర్యంలో ఎస్సీ కాలనికి చెందిన సుమారు 50 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరందరికి హనిమిరెడ్డి పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. 6 నెలలుగా అద్దంకి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ మీ సమస్యలను నా సమస్యలుగా భావిస్తూ పరిష్కారానికి దశల వారీగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఏ సమస్యల ఉన్నా తనను ఫోన్‌కాల్‌తో నేరుగా సంప్రదించవచ్చన్నారు. జగనన్న మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ అమలుతో రోజురోజుకు వైఎస్సార్ సీపీకి బలం పెరుగుతుందన్నారు. కుల, మత పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు వలంటీర్ వ్యవస్థద్వారా అందించటం వల్ల తనను, లన కుటుంబ సభ్యులను గ్రామాల వారీగా ఆదరిస్తున్నారని ఇదే ఆదరణతో తమ విజయానికి ఓట్లు వేసి ఆశీర్వదించాలన్నారు. 58 నెలలో జగనన్న సుపరిపాలనతో విప్లవాత్మక మార్పులు తెచ్చారని రాబోయో కాలంలో కూడా మంచి పాలనతో సంక్షేమ పథకాలన్ని కొనసాగిస్తారన్నారు. 30 రోజుల పాటు కలసికట్టుగా కష్టించి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో గంధం లాజర్, దేవసామి, తంగిరాల అయ్యన్న, ఇసాక్, పోతురాజు, తిమోతి, పెదపోతురాజు, చినపోతురాజు, యరజాని కోటేశ్వరరావు, వెంకటరావు, రోశయ్య, సురేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. కాలనీలోని మహిళలతో మాట్లాడా సమస్యలను తెలుసుకున్నారు.

ఏబీసీకి చేరిన సాగర్ జలాలు



పరవళ్లు తొక్కుతున్న సాగర్ జలాలు

బల్లికురవ: ప్రభుత్వం సాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలను విడుదల చేసింది. శనివారం అద్దంకి బ్రాంచ్ కాలువ వైదన పవర్‌ప్లాంట్ వరకు సాగర్ నీరు చేరింది. వారం రోజుల పాటు మంచినీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం నీటిని విడుదల చేసిందని నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చెరువులను సాగర్ నీటితో పూర్తిస్థాయిలో నింపుకోవాలని తహశీల్దార్ ఎం. సుభద్ర ఎన్నెస్పీ ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారుల పర్యవేక్షణలో చెరువులన్నింటిని నింపుతారన్నారు. నీటిని పంట పొలాలకు, చేపల చెరువులకు మళ్లిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీతారామ కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు



రోట్లో పసుపు దంచుతున్న మహిళలు

వేటపాలెం: ఆణుమల్లిపేట మహాలక్ష్మమ్మ అమ్మవారి మందిరం వద్ద శ్రీరామనవమిని పురస్కరించుకొని మహిళా సంఘం వారిచే స్వామి వారికి కల్యాణానికి హిందు సంప్రదాయ పద్ధతిలో మహిళలు శనివారం రోట్లో పసుపు దంచారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరి పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి రోజున మందిరం ప్రాంగణంలో సీతారామ కల్యాణం మహోత్సం నిర్వహించనున్నారు. అనంతరం అదేరోజు సాయంకాలం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, అనంత లక్ష్మి, స్రవంతి, రాధ, గాయత్రి, వంశీ, సుకన్య, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

సముద్రంలోకి 44 తాబేళ్ల పిల్లలు



సముద్రంలోకి తాబేళ్లను వదులుతున్న సమన్వయకర్త చంద్రారెడ్డి

వేటపాలెం: మండల పరిధిలోని రామచంద్రాపురం సముద్ర తీరం నుంచి అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్ సంయుక్త అధ్వర్యంలో 44 తాబేళ్ల పిల్లలను విశ్రాంత తహశీల్దార్ డీ వెంకట సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా సముద్రంలోకి శనివారం విడుదల చేశారు. ఈసందర్భంగా జిల్లా సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి మాట్లాడుతూ జీవ వైవిధ్య సంరక్షణలో సముద్రపు తాబేళ్ల సంరక్షణ ప్రధామని చెప్పారు. వీటిని పక్షులు, ఇతర జంతువులు నుంచి కాపాడి సురక్షితంగా సముద్రంలోకి వదలడం గొప్ప విషయమన్నారు. సముద్రపు తాబేలు జీవిత కాలం దాదాపు 300 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. రామచంద్రాపురం తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుంచి ఇప్పటివరకు ఆరు తల్లి తాబేళ్ల పెట్టిన గుడ్ల నుంచి 640 పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి వదిలామని చెప్పారు. ఇంకా 19 తల్లి తాబేళ్ల పెట్టిన 1990 గుడ్ల నుంచి వచ్చే పిల్లలను వదలాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో తాబేళ్ల సంరక్షకులు జాలయ్య, వెంకటేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



చీరాలలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై మురళీ, సిబ్బంది



బల్లికురవలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఏఎస్సై

చీరాల టౌన్: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ సూచించారు. శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శృంగారపేట, ఆనందపేట, పేరాల, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో బీఎస్‌ఎఫ్ పోలీసు బలగాలు, సివిల్ పోలీసులతో కవాతు నిర్వహించారు. గత ఎన్నికల సమయంలో ఘర్షణల నేపద్యంలో ప్రధాన రహదారుల్లో కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ఎలాంటి గొడవలు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలకు ఒత్తాసుగా గ్రామాల్లో గొడవలు సృష్టించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై మురళీ, పోలీసు సిబ్బంది, బీఎస్‌ఎఫ్ బెటాలియన్ పోలీసులు ఉన్నారు.

నాలుగు గ్రామాల్లో పోలీసుల కవాతు

బల్లికురవ: రాబోయే ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించు కోవాలని సంతమాగులూరు సీఐ నరసింహారావు పిలుపునిచ్చారు. కేంద్ర బలగాలతో శనివారం సాయంత్రం వేమవరం, ముక్తేశ్వరం, రామాంజనేయపురం, గొర్రెపాడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికల దృష్ట్యా అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసేందుకు రాజకీయ పార్టీలు, ఓటర్లు సహకరించాలని సీఐ కోరారు. కవాతులో బల్లికురవ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై సీ. బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంకొల్లు (చినగంజాం): ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఇంకొల్లు ఆర్‌ఎస్‌డీటీ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సూదివారిపాలెం పంచాయతీ కార్యాలయం ఆవరణలో స్వీప్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వికలాంగులు, వృద్ధులకు పోలింగ్ స్టేషన్‌ల వద్ద ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేశారని, అదే విధంగా వారికి హోం ఓటు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో కే గురవయ్య పాల్గొన్నారు.

హనిమిరెడ్డి విజయానికి కృషిచేయాలి



నార్నేవారిపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు



పార్టీలో చేరిన వారితో మహేష్‌రెడ్డి

జే.పంగులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలబడాలని మండల పార్టీ ఇన్‌చార్జ్ బిజ్జి శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు కోరారు. మండల పరిధిలోని నార్నేవారిపాలెంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు తిరిగి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎన్నికల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా హనిమిరెడ్డి కోసం ఫ్యాన్ గుర్తుపై ఒకసారి, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ కోసం రెండోసారి ఫ్యాన్ బటన్‌పై నొక్కాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింత చెరువు డేవిడ్, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ సందిపోగు రవీంద్ర (బుజ్జి), బీసీ సెల్ కన్వీనర్ చక్రవరం భాస్కర్‌రాజు, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఏజర్ల జోయెల్, రాయపాటి శ్రీనివాసరావు, గుండుపల్లి రాజశేఖర్, సామేలు, మాజీ ఏఎంసీ చైర్మన్ పీ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన జువ్విగుంట రామ్మోహన్, మాజీ ఎంపీటీసీ మేరుగపల్లి చంద్రయ్య ఆధ్వర్యంలో 30 కుటుంబాలు టీడీపీని వీడి మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కైపు మహేష్‌రెడ్డి సమక్షంలో శనివారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరందరికి మహేష్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయో ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేసి హనిమిరెడ్డిని, నందిగం సురేష్‌ను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేడు పూనూరులో బాలాజీ ఎన్నికల ప్రచారం

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యడం బాలాజీ ఆదివారం ఎన్నికల ప్రచారయాత్ర చేయనున్నట్లు పర్చూరు పార్టీ కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి జరిగే ఈ ఎన్నికల ప్రచారయాత్రకు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

సీఎం జగన్‌పై రాళ్ల దాడి అమానుషం

చినగంజాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై రాళ్ల దాడి చేయడం అమానుష చర్యని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మండల కన్వీనర్ వెంకట నాగేశ్వర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, కడవకుదురు గ్రామ కన్వీనర్ సందు రవితేజలు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఈ విధంగా దాడికి పాల్పడటం అతిహేయమైన చర్య అని తెలిపారు. ధైర్యం ఉంటే ఎన్నికల్లో గెలిచి చూపించాలి గాని ఈ విధంగా ఆయనపై దాడి చేయడం సరైన విధానం కాదన్నారు. రేపు జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి తిరిగి సీఎంగా విజయం సాధించడం ఖాయమన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, చైత్ర మాసం, ఆరుద్ర నక్షత్రం, షష్ఠి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

భారత రాజ్యాంగ పరిరక్షణపై చర్చా వేదిక

ఒంగోలు సెంట్రల్: భారత రాజ్యాంగ పరిరక్షణకు రాజ్యాంగంలోని ప్రజాస్వామిక, లౌకిక ఆదేశిక సూత్రాల పరిరక్షణకు ప్రజలు ముందుకు రావాలని వక్తలు అన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో శనివారం అంబేద్కర్ జయంతి, కారల్ మార్క్స్, భగత్ సింగ్, చంద్రా రాజేశ్వరరావు వర్ధంతి సభలు నిర్వహించారు. శాస్త్రీయ, సామ్యవాద అధ్యయన వేదిక ఒంగోలు కన్వీనర్ ఎం.వెంకయ్య అధ్యక్షత వహించారు. భారత రాజ్యాంగ పరిరక్షణ–నేటి భారతదేశం అనే అంశంపై చర్చించారు. వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్, ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిరెడ్డి హనుమంతారెడ్డి, అంబేద్కర్‌వాదులు, వామపక్ష అభిమానులు పాల్గొన్నారు.

16న అభ్యసన సాధన సర్వే పరీక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో

చీరాల అర్బన్: రాష్ట్రస్థాయి అభ్యసన సాధన సర్వే పరీక్ష విద్యార్థుల స్థాయి నైపుణ్యాలను అర్థం చేసుకోవడానికి సహాయ పడుతుందని మండల విద్యాశాఖాధికారి పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో చీరాల డివిజనల్ స్థాయి 13 మండలాల సీఆర్పీలు, ఫీల్డ్ ఇన్విజిలేటర్‌లకు అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యార్థుల అభ్యసన లోపాలను అర్థం చేసుకోవడంలో ఈ సర్వే పరీక్ష ఉపయోగపడుతుందని, అభ్యసన ఫలితాలను పాఠశాలల వారీగా విశ్లేషించడానికి, పోల్చడానికి సహాయపడుతుందని అన్నారు. ఈ పరీక్ష 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తారని, ఇంగ్లీషు, మ్యాథ్స్, తెలుగు సబ్జెక్టుల్లో ఈ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష రెండు సార్లు ఏదైనా సబ్జెక్టుల కాంబినేషన్‌లతో ఉంటుందన్నారు. ఈ రెండు పరీక్షలు 15 నిమిషాల విరామంతో ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు, తర్వాత 10.45 నుంచి 12.15 నిమిషాల వరకు నిర్వహిస్తారన్నారు. మాస్టర్ ట్రైనర్‌గా పవని భానుచంద్రమూర్తి వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్‌రాజు, డివిజన్ పరిధిలోని 13 మండలాల సీఆర్పీలు పాల్గొన్నారు.